'ఆంధ్రజ్యోతి' చదువుదాం



ఎండ వేడికి ట్యాంక్‌బండ్‌పై నీడన కూర్చొని 'ఆంధ్రజ్యోతి' పత్రిక చదువుతున్న ఓ వ్యక్తి

లవర్స్ డేపై ఆంక్షల ఎఫెక్ట్



ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ కొందరు ఆందోళనలకు పిలుపునివ్వడంతో సందర్శకులు లేక వెలవెలబోయిన నెక్లెస్ రోడ్డులోని ఓ పార్క్

'సుందరీ'కరణపై పాన్ మరక



నగర సుందరీకరణలో భాగంగా మాసబ్ ట్యాంక్ బ్రిడ్జి వద్ద వేసిన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చిత్రలేఖనం మోనాలిసా పెయింటింగ్ ఇలా గుట్కా, పాన్ మరకలతో నిండిపోయింది.



రాముకు పురస్కారం అందజేస్తున్న దర్శకుడు రేలంగి నరసింహారావు

రావి కొండలరావు పురస్కార ప్రదానం

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హాస్యాన్ని పండించడంలో, రంగస్థలం, పౌరాణిక, నాటకాలను అద్భుతంగా నిర్వహించడంలో రావి కొండలరావు నైపుణ్యాన్ని ఎంత పొగిడినా తక్కువేనని ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు కొనియాడారు. రావి కొండలరావు జయంతిని పురస్కరించుకొని సిద్ధార్థనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రావి కొండలరావు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యవరపు రాముకు రావి కొండలరావు నగదు పురస్కారం రూ.25 వేలు అందజేశామన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా కాకినాడ రమణ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి నిస్సార్ అహ్మద్, సభ్యులు కృష్ణవేణి శతకోపాన్, అరుణకుమారి మండపాక, పి.రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో విద్యావేత్త అంచల్ అగర్వాల్

రుతుస్రావంపై యువతులకు అవగాహన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రుతుస్రావంపై బహిరంగంగా చర్చించాలని విద్యావేత్త అంచల్ అగర్వాల్ అన్నారు. గ్లో ఫ్లో పీరియడ్ పేరిట హోలిస్టిక్ చైల్డ్ డెవలప్‌మెంట్, మార్హామ్, రెసోనేటింగ్ రెసిలెన్స్ సంస్థలు సంయుక్తంగా బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో శుక్రవారం యువతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యావేత్త అంచల్ అగర్వాల్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఖలీలుర్ రెహమాన్, సోఫియా హసీబ్ హాజరయ్యారు. ఇందులో భాగంగా పీరియడ్స్‌ను అవమానపరిచే ఆలోచనలు సరికాదంటూ స్టాండ్‌అప్ కామెడీగా ప్రదర్శించారు. హోలిస్టిక్ చైల్డ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షురాలు అనుపమ దాల్మియా, మారామ్ రెసోనేటింగ్ రెసిలెన్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నబత్ లఖానీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు హెల్ప్‌లైన్ నంబర్

బోరబండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ వార్డు సర్కిల్-19 పరిధిలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకోసం ఇప్పటి వరకు 2,860 దరఖాస్తులు వచ్చాయని సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలిపారు. శుక్రవారం వార్డు కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో ఆమె మాట్లాడుతూ.. ప్రజా పాలనలో వచ్చిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే, ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తుల వివరాలను ఆమె వెల్లడించారు. ఇంటింటికి తిరిగి సిబ్బంది వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేశామన్నారు. ప్రజలకు సమాచారం అందించడానికి హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారన్నారు. పూర్తి ఆదేశాలు రాగానే హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉద్యోగానికి వెళ్లొచ్చేసరికి చోరీ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. మేకా పవన్ తన స్నేహితులైన ఈశ్వర్, సాయి, సంతోష్‌లతో కలిసి వెంకటగిరిలో ఉంటున్నాడు. వీరంతా మాదాపూర్ బజాజ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నారు. ఈ నెల 13న ఆఫీసుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా 3 ఫాస్ట్‌ట్రాక్ వాచ్‌లు, బంగారు గొలుసు కనిపించలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ సెల్‌ఫోన్‌తో ఉడాయించిన వ్యక్తి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించిన వ్యక్తి మహిళ సెల్‌ఫోన్ తీసుకొని వెళ్లిపోయాడు. చింతల్‌కు చెందిన సునితారాయ్ ప్రైవేటు ఉద్యోగి. ఏడాదిగా ఇక్రంఖాన్‌తో ఆమెకు పరిచయం ఉంది. ఈ నెల 13న ఉద్యోగం విషయంపై మాట్లాడుకుందామని ఆమెను బంజారాహిల్స్ హ్యాబిటేట్ కేఫ్‌కు పిలిచాడు. అనంతరం ఇద్దరూ బయటకు వచ్చారు. సునితారాయ్ క్యాబ్ కోసం వెయిట్ చేస్తుండగా ఇక్రంఖాన్ ఆమె ఫోన్ తీసుకుని క్షణాల్లో అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. ఫోన్ చేస్తే స్పందించలేదు. అందులో తన వ్యక్తిగత సమాచారం ఉందని, నిందితుడిని పట్టుకోవాలని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తి మృతి

బోరబండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అపస్మారక స్థితిలో పడిఉన్న వ్యక్తి మృతిచెందిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పర్వత్‌నగర్‌కు చెందిన ప్లంబర్ మల్లేష్ (37) సైట్-3 కల్లు కాంపౌండ్ ఎదురు రోడ్డులో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని గురువారం రాత్రి స్థానికులు 100కు సమాచారం అందించారు. బోరబండ పీఎస్‌కు చెందిన పెట్రోలింగ్ పోలీసులు వెళ్లి పరిశీలించగ అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు.

మా ప్లాట్లను కబ్జా చేశారు

- అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు
- ప్రభుత్వం న్యాయం చేయాలి
- సీఎంకు సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ వాసుల విజ్ఞప్తి

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పైసాపైసా కూడబెట్టి కొనుగోలు చేసిన తమ ప్లాట్లను కొందరు కబ్జా విక్రయిస్తున్నారని సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్ రాజగోపాల్ నగర్ ప్లాట్ల వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్లాట్లలో భవనాలు సైతం నిర్మిస్తున్నారని, తాము ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో కీలక మంత్రి అండ ఉందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఓ రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ సోదరుడు, నాయకులు తన వెనక ఉన్నారని కబ్జాదారుడు బెదిరిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్లాట్ల వద్దకు వచ్చి మాట్లాడుతుండగా సుప్రీంకోర్టు న్యాయవాది అని చెప్పుకుంటున్న ఓ వ్యక్తి వచ్చి ఆయనతో వాగ్వాదానికి దిగాడన్నారు. తమ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, సందీప్ కుమార్, ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. 1984లో స్థలాలను కొనుగోలు చేశామని, స్థానిక ప్రజాప్రతినిధులు, అవినీతి అధికారుల అండదండలతో తప్పుడు పత్రాలు సృష్టించి తమ భూమిని కబ్జా చేశారని బాధితులు వాపోయారు. న్యాయస్థానం ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని వారు పేర్కొన్నారు.



తమ వద్ద ఉన్న పత్రాలను చూపిస్తున్న ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే..

బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాతే తమ ప్లాట్లను ఆక్రమించి దొంగ పత్రాలతో నోటరీ, జీపీఏ చేసి తక్కువ ధరకే విక్రయిస్తున్నారని చెప్పారు. తమ ఫిర్యాదు మేరకు ఇటీవల 250 నిర్మాణాలను సంబంధిత అధికారులు కూల్చివేశారన్నారు. ఓ మాజీ ఎమ్మెల్సీ తనకు ఇక్కడ భూమి ఉందని చెప్పి తన సామాజికవర్గం వారితో ఇళ్లు కట్టిస్తున్నారని ఆరోపించారు. త్వరలో సీఎంను కలుస్తామని, న్యాయం చేయకుంటే పెట్రోల్ పోసుకుని ప్లాట్ల వద్దే కూర్చుంటామని వారు వెల్లడించారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

పంబాల, మన్నెలను గ్రూపు-1 నుంచి తొలగించాలి

- బేడ బుడగ జంగం సంఘాల నేతల డిమాండ్

పంజాగుట్ట, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందిన పంబాల, మన్నె కులాలను ఎస్సీ వర్గీకరణలోని గ్రూపు-1 నుంచి తొలగించాలని బేడ బుడగ జంగం సంఘాలు డిమాండ్ చేశాయి. గ్రూపు-1లో ఉన్న వెనుకబడ్డ కులాలకు మూడు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సంఘాల నేతల విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో ఎస్సీ 57 ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం, బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం, జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నర్సింహ, రాష్ట్ర అధ్యక్షుడు సహదేవుడు, బేడ బుడగ జంగం-జన సంఘం అధ్యక్షుడు సిరిపాటి వేణు తదితరులు మాట్లాడారు. తమకు జరిగిన అన్యాయంపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి, ఏక సభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌లను కలుస్తామని వారు పేర్కొన్నారు.అభివృద్ధి చెందిన మన్నె, పంబాల కులాలను గ్రూపు-1లో నుంచి గ్రూపు-3లోకి మార్చాలన్నారు. రిజర్వేషన్ ఫలాలు, సంక్షేమ పథకాలు తమకు అందడం లేదని, త్వరలోనే వందలాది మందితో సభ నిర్వహిస్తామని, దీనికి మంద కృష్ణమాదిగను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కె.గిరి, కె.రాంబాబు, గోవిందు, వెంకట్, పి.శివ, జి.వెంకటస్వామి, కె.ఎల్లేష్, రమేష్, మధు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు



అభివాదం చేస్తున్న బేడ బుడగ జంగం సంఘాల నాయకులు

నా భూమి రాసివ్వమంటున్నారు

- నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి ఆవేదన
- ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తన భూమిలో కొంత భాగాన్ని పట్టా చేయాలని బెదిరిస్తున్న వ్యక్తిపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తన పొలం, కోళ్ల ఫామ్‌లోకి వెళ్లనివ్వడం లేదని, తనపై రౌడీ షీట్ తెరుస్తామని బెదిరిస్తున్నారని వాపోయాడు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన రైతు దంపతులు ముచ్చపోతుల వెంకన్న, సరిత తమ గోడు వెళ్లబోసుకున్నారు. తనకు, తన సోదరులకు 21 ఎకరాల భూమి ఉందని, తన వాటాగా ఆరు ఎకరాలు రాగా.. తన భూమి పక్కనే ఉన్న భూ యజమాని, స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు వేధిస్తున్నాడని బాధితుడు చెప్పాడు. తన భూమిలో 36 గుంటల స్థలాన్ని అతని పేరుతో పట్టా చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని, పలుమార్లు దాడికి పాల్పడ్డాడని ఆరోపించాడు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్న నకిరేకల్ సీఐ రాజశేఖర్, సంబంధిత వ్యక్తులపై ఈ నెల 20 లోపు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరాడు. దీనిపై నకిరేకల్ సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా వెంకన్న చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ సీవీ ఆనంద్

జగ్ నేకీ రాత్..

పెట్రోలింగ్ నిర్వహించిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జగ్ నేకీ రాత్ ప్రార్థనలను గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని మక్కా మసీదులో రాత్రంతా ప్రార్థనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. పెట్రోలింగ్ పోలీసులతో కలిసి గస్తీలో పాల్గొన్నారు. సీపీ వెంట ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, సీసీఎస్ డీసీపీ శ్వేత, సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహరా తదితరులు ఉన్నారు.

20న విద్యుత్ కార్మికుల 'చలో విద్యుత్ సౌధ'

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ కమిటీ చైర్మన్ ఎం.ధన్‌రాజ్, కన్వీనర్ కె.శంకర్ నాయక్ ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న వేలాది మంది కార్మికులతో చలో విద్యుత్ సౌధ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఖైరతాబాద్ మింట్ కంపౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు చలో హైదరాబాద్ విద్యుత్ సౌధ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యుత్ రంగంలో పది నుంచి ఇరవై సంవత్సరాలుగా సుమారు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ సంస్థలో కొంతమందిని విలీనం చేసిందని, గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే అందరినీ కన్వర్షన్ ద్వారా పూర్తిగా విలీనం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా వివిధ ప్రాంతాల్లో దీక్షలు చేశామని, పది రోజుల పాటు రాష్ట్రం మొత్తం బస్సు యాత్ర సైతం చేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, తమను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ విద్యుత్ సౌధ ముట్టడికి పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ నాయకులు



కుమ్మరి బస్తీలో పర్యటిస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్‌లో వేగంగా అభివృద్ధి పనులు

- నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డా.కోట నీలిమ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డా. కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట్ డివిజన్‌లోని కుమ్మరి బస్తీలో సీసీ రోడ్డు పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతో ప్రత్యేకంగా ఓ నివేదికను రూపొందించి ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందచేసినట్టు చెప్పారు. ఇందులో భాగంగా నిధులు మంజూరు అవుతున్నాయని, దశలవారీగా అన్నిచోట్ల పనులు మొదలవుతాయన్నారు. ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. కుమ్మరి బస్తీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 45 లక్షల రూపాయలు మంజూరు చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ జమీల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న స్థితప్రజ్ఞ తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మోతీనగర్ శాఖ మేనేజర్ స్థితప్రజ్ఞ అన్నారు. శుక్రవారం రాజీవ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ఏ విధంగా మోసాలకు పాల్పడుతున్నారో అంచనా వేయలేకపోతున్నామన్నారు. ఫోన్లు చేసి మనల్ని నమ్మించే విధంగా మాట్లాడుతూ భయభ్రాంతులకు గురిచేసి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. బాగా చదువుకున్న వారు సైతం సైబర్ నేరాల బారిన పడుతున్నట్లు చెప్పారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు తప్పకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

తెలంగాణ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు

మారుడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు కె.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఈ నెల 17వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈనెల 17న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా తెలంగాణ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ముఖ్యనాయకులతో వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈ నెల 17న పార్టీ శ్రేణులు ఆయా ప్రాంతాల్లో కేసీఆర్ జన్మదిన వేడుకలలో భాగంగా కేక్ కటింగ్, పండ్ల పంపిణీ, ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు లక్ష్మి, టి.మహేశ్వరి, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎల్ఓసీ పత్రం అందజేత..

మారేడుపల్లిలోని తన కార్యాలయంలో శుక్రవారం బల్కంపేటకు చెందిన రాజేశ్వరికి సీఎం సహాయనిధి నుంచి మంజూరు అయిన రూ.2.75 లక్షల ఆర్థిక సహాయం మంజూరు పత్రా(ఎల్ఓసీ)న్ని బాధితురాలుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివస్ యాదవ్ అందజేశారు.



సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మహిళా జడ్జిపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోర్టు హాల్‌లోనే మహిళా జడ్జిపై చెప్పు విసిరిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ వై.వసంత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ సివిల్‌కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులను బహిష్కరించి దాదాపు 3 గంటల పాటు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, జడ్జిలకు ప్రత్యేక చట్టం తీసుకరావాలని ఆయన కోరారు. దాడికి పాల్పడ్డ వ్యక్తికి కఠినంగా శిక్ష విధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టీవీ రమణ, ప్రధానకార్యదర్శి సుశీల్ కుమార్, పుష్పలత, అనిల్‌కుమార్‌యాదవ్, మురళీధర్‌యాదవ్, సీనియర్ న్యాయవాది శ్రీనివాస్‌చారి, రాజశేఖర్, జనార్దన్‌రెడ్డి, ఉషారాణి, స్వామి, శ్రీనివాస్‌రావు, రాజలింగం, శ్రవంతి, ప్రభాకర్‌యాదవ్, మహేశ్వరి పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావుతో బీజేపీ నేతలు

వాహనాలు క్యూ పద్ధతితో పార్కు చేయండి

- డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలోని మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రెండు రోజుల క్రితం అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన విషయం తెలిసిందే. ఇక్కడి పరిస్థితిని తెలుసుకునేందుకు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావుతో పాటు అధికారుల బృందం శుక్రవారం ఉదయం 6 గంటలకు అడ్డగుట్టలో పర్యటించింది. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా అక్రమకట్టడాలు నడుస్తున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతోనే కూల్చివేశామని తెలిపారు. లంబాడీబస్తీలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం లేదని ఎవరైనా సరే క్యూ పద్ధతిలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. కొత్త రోడ్డు కోసం తవ్విన ప్రాంతంలో వెంటనే రోడ్డు వేసి వినియోగంలోకి తీసుకరావాలని ఇంజనీర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కారులో అమర్చిన మల్టీటోన్డ్ హారన్‌ను సీజ్ చేసిన ట్రాఫిక్‌పోలీసులు

సైరన్, మల్టీటోనెడ్ హారన్‌ను వాడితే కఠిన చర్యలు

బౌద్ధనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజోతి): కారులు, ఇతర వాహనాల్లో సైరన్, మల్టీటోనెడ్ హారన్‌ను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం ఆలుగడ్డబావి వద్ద ట్రాఫిక్‌పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్లు, ఇతర వాహనాల్లో అమర్చిన సైరన్, మల్టీటోనెడ్ హారన్లను సీజ్‌చేశారు. పోలీస్, అంబులెన్స్, ఫైర్, రక్షణ విభాగాల వారు మాత్రమే ఈ సైరన్‌లను ఉపయోగించవచ్చునని తెలిపారు. సైరన్‌లు అమర్చిన వాహనాలకు చలానాలను విధించారు. ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాల బకాయిలను చెల్లించాలి

తెలంగాణ విజయా డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్

తార్నాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న పాల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ విజయా డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయా డైయిరీ అధికారులు పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించడంలో తీవ్రంగా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజలకు ఒకసారి చెల్లించాల్సిన పాల బిల్లులు 2 నెలలకు ఒకసారి చెల్లించడం వల్ల తాము ఆర్థికంగా ఇబ్బందులకు గురువుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విజయా డైయిరీ అధికారులు స్పందించి 15 రోజులకు ఒకసారి పాల బిల్లులు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మా పనులే!

● కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా ప్రకటనలు



ప్రారంభోత్సవంలో ఎంపీ రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేటర్ దీపిక

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో రూ.37 లక్షలతో చేపట్టనున్న రోడ్డు, స్టార్మ్ వాటర్ పైపులైన్ పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు. శుక్రవారం ప్రారంభోత్సవానికి ముందుగా కార్పొరేటర్ చేరుకోగా తరువాత ఎమ్మెల్యే చేరుకున్నారు. తరువాత ఎంపీ ఈటల రాజేందర్ రాగా అందరూ కలిసి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడిన తరువాత కార్పొరేటర్ దీపిక మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తన వల్ల పనులు ప్రారంభం అయ్యాయని ప్రచారం చేసుకోవడం సరికాదని, రెం డేళ్లుగా సమస్య పరిష్కారం కోసం కష్టపడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్,బాబురావు,అల్లాడి గౌరిశంకర్,నందికంటి రవి,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేపట్టాం

డ్రైనేజీ, రోడ్డు సమస్యలతో బాధపడుతుంటే పరిశీలించి జీహెచ్ఎంసీ రూ.40 లక్షల నిధులతో స్టార్మ్‌వాటర్ పైపులైను పనులు చేపట్టబోతున్నాం. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది. కనుక కేంద్ర ప్రభుత్వ నిధులతో సంపూర్ణ అభివృద్ధికి ప్రణాళికలు వేసుకున్నాం. ఇప్పటికే ఐదారు కోట్ల నిధులు ఆరేడు నెలల్లో రాగా పనులు చేపట్టినాం. భవిష్యత్‌లో పార్కులతో పాటు, స్థానిక వ్యాపారులకు అందరికీ సౌకర్యంగా ఉండేలా వసతుల కల్పనకు కృషి చేస్తాం.

- ఎంపీ ఈటల రాజేందర్

మోండా డివిజన్‌కు రూ.4 కోట్లు

రూ.37 లక్షలతో స్టార్మ్‌వాటర్ పనులు మొదలు పెట్టినాం. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి జరగలేదు. మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తది. హైదరాబాద్ అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించింది. మోండా డివిజన్‌కు రూ.4 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ డబ్బులతో మోండాలో అభివృద్ధి చేయగలుగుతన్నాం.

కానీ కంటోన్మెంట్ 8 వార్డులు ఉన్నాయి. కేంద్రప్రభుత్వం సహాయం లేనందున కనీసం సర్వీస్ చార్జీలు ఇవ్వకపోవడం వల్ల అభివృద్ధి జరగడం లేదు. మరీ ముఖ్యంగా ఎమ్మెల్యే అయిన తరువాత ప్రజాప్రతినిధులు, అధికారులను పిలిచి ప్రారంభోత్సవాల్లో అందర్నీ భాగస్వామ్యులను చేస్తున్నాం. కానీ కంటోన్మెంట్‌బోర్డు పరిధిలో ఓ వ్యక్తి కొబ్బరికాయల బండిలో కొబ్బరికాయలు పెట్టుకుని ఎక్కడ పోయినా కొట్టుకుంటూ పోతూ, కేంద్రం డబ్బులు ఇచ్చిందని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విషయంపై ఆర్టీఐ ద్వారా అడిగా. కంటోన్మెంట్ బోర్డు మీటింగ్‌లో కూడా అడిగా. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులూ రావడం లేదని తెలిపారు. నామినేటెడ్ పదవి ఉన్న ఒకతను వారే కొబ్బరికాయలు కొట్టడం పద్ధతి కాదని ఈటల రాజేందర్ కూడా తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే రాష్ట్ర, జీహెచ్ఎంసీ నిధులతో అభివృద్ధి జరుగుతుంది.

- శ్రీగణేష్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే

10 రోజుల్లో పనులు అవుతాయా...?

వానపడినప్పుడల్లా వర్షపునీటితో 12 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం తాను పలుమార్లు అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లా. సాయన్న, లాస్యనందిత ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వారి దృష్టికి తీసుకెళ్లినా పనులు జరగలేదు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీగణేష్ 10 రోజుల క్రితం ఇక్కడికి వచ్చి సమస్య పరిశీలించి నిధులు మంజూరుచేయించి, పనులు చేపట్టామంటున్నారు. 10 రోజుల్లో పనులు అవుతాయా...? ప్రాసెస్, టెండర్, ఆర్డర్‌కు సంవత్సరాలు పడుతుందని, అలాంటిది 10 రోజుల్లో మంజూరు చేశామని చెప్పుకుంటున్నారు. రెండేండ్ల నుంచి 'మేము ఈ సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తుంటే ఇప్పుడు ఎమ్మెల్యే తన వల్లేనని చెప్పుకోవడం సమంజసమా' అని అన్నారు.

- కొంతం దీపిక, కార్పొరేటర్

మహ్మద్‌గూడలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడ్‌లో శుక్రవారం కార్పొరేటర్ సామల హేమ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా కలుషితనీరు వస్తుందని మహిళలు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. మంచినీటి పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టి కలుషితనీటిని నివారించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకుని నీటి కొరత లేకుండా చూడాలని సూచించారు. జలమండలి మేనేజర్ నవ్య, బీఆర్ఎస్ నాయకుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



మహ్మద్‌గూడలో కలుషిత నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ



జలమండలి జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నీటి సమస్యలను పరిష్కరించాలి

బౌద్ధనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లో నీటి సమస్యలను పరిష్కరించాలని మారేడుపల్లి జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం జలమండలి కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, పాపాలాల్, శంకర్రావు, రామాంజనేయులు, చంద్రమోహన్‌యాదవ్ తదితరులు జీఎం వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మైలార్‌గడ్డ ఎస్‌వీఎస్ గల్లీలో కలుషితనీరు వస్తుందని, అన్నానగర్‌లో పవర్‌బోర్‌వెల్ పాడైందని, భవానీనగర్‌లో డ్రైనేజీ పైపులైన్ సమస్య ఉందని జీఎంకు దృష్టికి తీసుకొచ్చారు. నీటి సమస్యలపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలి

తిరుమలగిరి ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ సమీపంలోని ఆశా ఆఫీసర్స్ కాలనీ నుంచి అమ్ముగూడ రైల్వే స్టేషన్ వరకు రోడ్డు గుంతలమయంగా మారి, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డునిర్మాణం కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.15కోట్లను మంజూరు చేసింది. నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే గణేష్‌ను కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్ ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిన్నన్న, పెర్మాల్, సురేష్ ఉన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌కుమార్

ఐదుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

● వేర్వేరు చోట్ల ఎక్సైజ్ పోలీసుల దాడులు ● 2.33 కిలోలు స్వాధీనం

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు నగరంలోని పలుచోట్ల ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.33 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లగండ్ల ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్ ఎస్సై బాలరాజు తన బృందంతో రంగంలోకి దిగారు. ఈ దాడిలో హన్మకొండకు చెందిన రాజేష్, మధ్యప్రదేశ్‌కు చెందిన రామరాజు జైస్వాల్, మనోజ్ కుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1.230 గ్రాముల గంజాయి, స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం నిందితులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఎస్సై బాలరాజు బృందంలో కౌశిక్, సాయికిరణ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



పట్టుబడ్డ ముగ్గురు గంజాయి స్మగ్లర్లు

● మరో కేసులో బాచుపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి టీమ్ రంగంలోకి దిగి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా బాచుపల్లికి చెందిన ఎండ్లపల్లి సందీప్, రాజమండ్రికి చెందిన రామిరెడ్డిగా తేలింది. వారి వద్ద నుంచి 1.1 కేజీ గంజాయి, బైక్, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ముఠాలుగా ఏర్పడి తక్కువ మోతాదులో ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తెప్పించి, చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు తేలింది. నిందితులను కత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

రైల్వే టికెట్ చెకింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



టికెట్ చెకింగ్ స్టాఫ్ సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్.శంకర్ రావు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే టికెట్ చెకింగ్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు తెలిపారు. శుక్రవారం రైల్వే మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యాలయంలో జరిగిన రైల్వే టికెట్ ఉద్యోగుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే రైల్వే ఉన్నాధికారుల దృష్టికి తీసుకెల్లి పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి రవీందర్, కోశాధికారి నర్సింహ పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

వారాసిగూడలో ఎంకేఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పుల్వామా దాడుల్లో ప్రాణాలర్పించిన అమర జవాన్ల ఫొటోల వద్ద నివాళులర్పించిన కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ తదితరులు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. - బౌద్ధనగర్





'మా అమెరికా పర్యటన' ఆవిష్కరణ

విశ్వ నియమాలను ప్రపంచవ్యాప్తం చేయాలనే ఉద్దేశంతో డా. లక్కరాజు నిర్మల రచించిన 'మా అమెరికా పర్యటన' అనే పుస్తకాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం తార్నాకలోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొ.బాగయ్య, సతీష్‌శర్మ, కొండపల్లి నరసింహారావు, రేణుకాపతి, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మధురానగర్‌కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కిషన్‌రెడ్డికి 'మధురానగర్ కాలనీ' వినతి

బౌద్ధనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌కు చెందిన మధురానగర్‌కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో మధురానగర్‌కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.బ్రహ్మాచారి, ప్రధానకార్యదర్శి ఏ.రాజుసాగర్, ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, శ్రీధర్, సభ్యులు పల్లయ్యగౌడ్, భానుప్రసాద్, మహేశ్‌కుమార్ తదితరులు కాలనీలోని సమస్యలపై కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో సీసీ కెమోరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్రమంత్రిని అసోసియేషన్‌సభ్యులు ఘనంగా సత్కారించారు.



వేంకటేశ్వరస్వామి రథయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మురళీకృష్ణ కోలాటం కళాకారులు

వైభవంగా బోయిన్‌పల్లి వేంకటేశ్వరస్వామి రథయాత్ర

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలో తిరుమలగా విరాజిల్లుతున్న బోయిన్‌పల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ముడుంబై రంగనాథచారి వేదపండితుల సమక్షంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు జరిపారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. బోయిన్‌పల్లి నుంచే కాకుండా చుట్టుపక్కల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా బోయిన్‌పల్లి ఆలయ పురవీధులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా మరుళీకృష్ణ కోలాటం కళాబృందం నృత్యం అందర్నీ ఆకర్షించింది. శనివారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ఆరగింపు, రుత్విక్ సన్మానం ఉత్సవ సమాప్తితో ఉత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో నారాయణ, జగన్నాధం, లక్ష్మణ్, రామ్మోహన్‌రావు, యాదయ్య, ఆలయ అర్చకులు పవన్‌స్వామి, దీపక్, శ్రీధర్ తదితరులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర నర్సింహను కలిసిన ఉప కులాల జాతీయ సంఘం సభ్యులు

ఉపకులాల కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ ద్వారా ఇప్పించాలి

● సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ నర్సింహ

అడ్డగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీరణపత్రాలు ఆర్డీఓ గాకుండా తహసీల్దార్ ద్వారా ఇప్పించాలని మాంగ్ గరోడి సంక్షేమ సంఘం అధ్యక్షుడు యు.సనాదన్, జాతీయ అధ్యక్షుడు వెంకటేశం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణ ఉపసంఘం చైర్మన్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహను మినిస్టర్ క్వార్టర్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుకారాంగేట్ మాంగోగోరడి బస్తీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేవంలో ఆయన మాట్లాడుతూ 57 ఉప కులాల సమస్యలను మంత్రికి విన్నవిస్తే సానుకూలంగా మంత్రి స్పందించారని తెలిపాడు. కార్యక్రమంలో సంఘం రతిలాల్, గోపి, సంజు, మహేష్, మోతీలాల్, నరేష్, కర్మకే, రాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంసారిబజార్‌కు చెందిన కోరం రాజు(40) అదృశ్యమయ్యాడు. బోయిన్‌పల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆర్థిక లావాదేవీల కారణంగా కొంతకాలంగా కోరం రాజు అతని భార్య శ్వేతకు చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 9న భార్యాభర్తలు గొడవపడి బయటకు వెళ్లిన రాజు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఈనెల 11న భర్త సోదరుడు కుమార్‌కు రాజు ఇంకా తిరిగిరాలేదని తెలిపింది. కుటుంబ సభ్యులు అందరూ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అదృశ్యమైన రాజు (ఫైల్)